క్లుప్తంగా

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న గొర్లె రామునాయుడు

సింహాచలం: రక్తదానం ఎంతో గొప్పదని, ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయాలని బీజేపీ పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రాము నాయుడు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినోత్సవ సేవాకార్యక్రమాల్లో భాగంగా శనివారం పెందుర్తిలోని ఆ పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. నగరంలోని లైన్స్ క్లబ్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో నాయకులు కంచిపాటి వెంకట సన్యాసిరావు, ఎర్ర అచ్చెంనాయుడు, కాళ్ల జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న పీఆర్‌వో నాయుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం గాజువాకకు చెందిన బి.శ్యామ్‌కుమార్ అనే దాత లక్ష 116 రూపాయిలు అందజేశారు. సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రంలో దేవస్థానం తరఫున పీఆర్‌వో నాయుడు దాతకు బాండ్ అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది దాసరి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



పొక్లెయిన్ సాయంతో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం:మండల కేంద్రంలోని పాత ఆస్పత్రి స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది శనివారం పొక్లెయిన్ సాయంతో తొలగించారు.తహసీల్దార్ బి.సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆర్‌ఐ వీరయ్య, వీఆర్వో రుక్మిణి మిగిలిన సిబ్బందితో కలిసి ఆక్రమణల తొలగింపు చేపట్టారు. సబ్బవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 337లో పాత ఆస్పత్రి స్థలం ఉందన్నారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం నేడు

అగనంపూడి: పీఆర్‌టీయూ అనకాపల్లి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్టు యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.గోపీనాథ్, సీహెచ్.పెద్దినాయుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడు విశ్వేశ్వరరావు తెలిపారు. అనకాపల్లి నరసింగరావుపేటలోని నారాయణ స్కూల్ (రామచంద్ర థియేటర్ వెనుక) ఆవరణలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న సమావేశంలో మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కమిటీ ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ప్రజలకు చేరువగా..

- జోన్–8 కార్యాలయంలో ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు
- పారిశుధ్య నిర్వహణకు స్పెషల్ డ్రైవ్
- అందుబాటులో అధికారులు



పన్నుల వసూలు కోసం ఏర్పాటు చేసిన సౌకర్యం కేంద్రం



వేపగుంటలోని జోనల్ కార్యాలయం

జీవీఎంసీ జోన్–8 అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఎం. మల్లయ్యనాయుడు	జోనల్ కమిషనర్	9912349439
పి.వి.వి.ఎస్. శ్రీనివాసమూర్తి	సూపరింటెండెంట్	9848112030
కె.జయరామ్	అసిస్టెంట్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ విభాగం	8187899199
పి.వి.వి.ఎస్ శ్రీనివాసమూర్తి	రెవెన్యూ అధికారి, రెవెన్యూ విభాగం	9848112030
జి.కృష్ణం రాజు	అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్, పబ్లిక్ హెల్త్ విభాగం	9247457537
వై.వై. శ్రీరామ్	అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్, యూసీడీ విభాగం	7729999788
డి.వి. రమణమూర్తి	కార్యనిర్వహణాధికారి	8187897572
మాధవరావు	డీఈఈ, నీటి సరఫరా విభాగం	8187897599
కాల్ సెంటర్ ఫోన్ నంబర్:		0891-2735353



కార్యాలయంలోని కాల్ సెంటర్

విశాఖ విద్య: ప్రభుత్వ నిర్ణయంతో అధికారులు ప్రజలకు మరింత చేరువయ్యారు. ఏ చిన్న సమస్య వచ్చినా నివేదించుకునేలా ప్రత్యేక సదుపాయాలు అందుబాటులోకి తెచ్చారు. ప్రతిసోమవారం నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో పాటు ఫోన్ ద్వారా కూడా సమస్యలు తెలియజేసే అవకాశం కల్పించారు. దీంతో జీవీఎంసీ జోన్–8 పరిధిలో ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయి. ఎస్‌ఏడీ కూడలి మొదలుకొని పెందుర్తి వరకు గల పది వార్డుల్లో ప్రజానీకానికి ఏ సమస్య వచ్చినా మేమున్నాం అంటూ జోనల్ కార్యాలయ అధికారులు స్పందిస్తున్నారు.

జోన్ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం కార్యాలయంలో ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. జీవీఎంసీ 89 నుంచి 98వ వార్డుల పరిధిలో ప్రజలు తమ సమస్యలను కాల్ సెంటర్‌కు నేరుగా ఫోన్ చేసి చెప్పుకోవచ్చు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పారదర్శకంగా సేవలు అందించడానికి అధికారులు, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు యంత్రాంగానికి దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జోనల్ కార్యాలయం పరిధిలో పనిచేసే వివిధ విభాగాల అధికారుల ఫోన్ నంబర్లు అందరికీ కనిపించేలా కార్యాలయం ప్రవేశ మార్గం వద్ద ఏర్పాటు చేయించారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక విభాగం

పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రతీ రోజూ తెల్లవారు జామునుంచే కేటాయించిన ప్రదేశాల్లో పారిశుధ్య సిబ్బంది విధుల్లో ఉండేలా కార్యాచరణ సిద్ధం చేశారు. చెత్త తొలగించే వాహనాలు వార్డుల వారీగా అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి



జోనల్ పరిధిలోని ప్రజలు జీవీఎంసీ పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం నేరుగా కార్యాలయంలో తెలియజేయవచ్చు. అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉంటారు. జీవీఎంసీ పరంగా అందించే సేవలు సద్వినియోగం చేసుకోవాలి. జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో పాటు ఫోన్ ద్వారా కూడా సమస్య తెలియజేయవచ్చు. – ఎం.మల్లయ్య నాయుడు, జోన్–8 కమిషనర్, జీవీఎంసీ

పకడ్బందీగా జగనన్న ఆరోగ్య సురక్ష

- ఎంపీడీవో హేమసుందర్రావు
- 26న ఏఎంఎల్‌కళాశాలలో దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందర్రావు

పరవాడ: ఈ నెల 30 నుంచి అక్టోబరు 16 వరకు మండలంలోని ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో వి.హేమసుందర్రావు సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, విద్యాశాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, అంగన్‌వాడీ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సంబంధిత శాఖల్లో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలకు తరలించి వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. అదేవిధంగా ఈ నెల 26న అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల ఆవరణలో కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంగవైకల్య నిర్ధారణ కార్యక్రమాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏ రకమైన అంగవైకల్యం ఉన్నా సంబంధిత కేంద్రానికి వచ్చి ప్రత్యేక వైద్య బృందం తనిఖీ చేసి అంగవైకల్యాన్ని నిర్ధారణ చేస్తుందని చెప్పారు. అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేస్తుందని చెప్పారు.

బిల్డింగ్ కోడ్స్–బైలాస్‌పై వర్కుషాపు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

సింహాచలం: పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బిల్డింగ్ కోడ్స్– బైలాస్‌పై వర్కుషాపు శనివారం నిర్వహించారు. తాజా జీవో ప్రకారం బిల్డింగ్ కోడ్స్, బైలాస్‌పై ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. భవన నిర్మాణానికి ఉన్న నిబంధనలు, పలు అంశాలను తెలియజేశారు. సెట్ బ్యాక్స్, మెట్ల వెడల్పు, పార్కింగ్ ప్రాంతం, అంతర్గత రహదారుల వెడల్పు, సైట్ క్లియరెన్స్ , హౌసింగ్ ప్లాన్‌లపై చర్చించారు. ఎత్తైన భవనాలు, మల్టీప్లెక్స్ కాంప్లెక్స్, గ్రీన్ బిల్డింగ్ నిర్మాణాలకు సంబంధించి నిబంధనలు, పర్మిషన్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ జాషువా తదితరులు

సింహాచలం: పెందుర్తి మండలం పినగాడిలోని వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నల్ హ్యాక్‌థాన్ ఫర్ స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ 2023(ఎస్‌ఐహెచ్–2023) నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో పలు విభాగాల నుంచి 33 టీమ్‌లు పాల్గొన్నాయి. సాఫ్ట్‌వేర్ విభాగంలో 26 టీమ్స్ పాల్గొని వివిధ సమస్యలకు పరిష్కారాలను ప్రజెంట్ చేశారు. హార్డ్‌వేర్ విభాగంలో ఏడు టీమ్‌లు అత్యాధునిక కంప్యూటర్ టెక్నాలజీకి సంబంధించిన సొల్యూషన్స్‌ను విశదీకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.జాషువా ఏర్పాట్లు పర్యవేక్షించారు. విద్యార్థులు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకొని ముందుకు వెళ్లాలన్నారు. తద్వారా భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ , ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ ఎస్.సునీత, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రకృతి పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలి



ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ప్రకృతి పరిరక్షణలో యువతను భాగస్వాములు చేయాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహిస్తున్న పర్యావరణ శాస్త్ర ఐడీఆర్‌సి తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ కృష్ణమోహన్ మాట్లాడుతూ మానవ అవగాహన రాహిత్యం, తప్పిదాలతో పర్యావరణానికి కొంత మేర నష్టం జరుగుతోందని చెప్పారు. నేడు పర్యావరణ విద్యను పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు ఒక అంశంగా అందించడం జరుగుతోందని చెప్పారు. నేటి తరం విద్యార్థులకు అవసరమైన జ్ఞానాన్ని అందించడంతో పాటు వారి సమగ్ర వికాసానికి ఉపయోగపడే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. పలు ప్రధాన నగరాల్లో పెరుగుతున్న జనాభా కాలుష్యం కారణంగా గాలి నాణ్యత ప్రమాణాలు పడిపోతున్నాయని, వీటికి తగిన పరిష్కారాలను నిపుణులు సూచించాలని కోరారు. హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకులు ఆచార్య టీవీ కృష్ణ మాట్లాడుతూ అధ్యాపకులకు అధునాతన బోధన నైపుణ్యాలపై అవగాహన కల్పించామన్నారు. పర్యావరణహితంగా విద్యార్థులను తయారు చేయాలని ఆచార్యులకు సూచించారు. శిక్షణ తరగతుల సమన్వయకర్త ఆచార్య ఉదయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులు గ్రీన్ అంబాసిడర్లగా నిలవాలని కోరారు. ఇక్కడ నేర్చుకున్న జ్ఞానాన్ని విద్యార్థులకు చేరువ చేయాలని చెప్పారు. సహజ వనరుల వినియోగం తగ్గించడం, వృథా నియంత్రించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కేంద్రం గౌరవ ఆచార్యులు ఆచార్య ఎన్.ఏ.డి పాల్ తదితరులు ప్రసంగించారు.

'కేంద్రానికి కనువిప్పు కలిగే వరకు ఉద్యమం'

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకు దీక్ష ఆగదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు శనివారం నాటికి 954వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం తర్వాత ప్రభుత్వరంగ పరిశ్రమల కారణంగా దేశంలో ఆర్థికాభివృద్ధి జరిగిందన్న అంశాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం పునరాలోచించాలని కోరారు.

మేనేజర్ల నిర్ణయాలతో సంస్థల విజయం



చార్టెడ్ అకౌంటెంట్ శామ్యూల్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో శనివారం 'ఫ్యూచర్ ఆఫ్ ది మేనేజ్మెంట్ అండ్ ఫ్యూచర్ సీఈవోలు' అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. కార్యక్రమానికి విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి అధ్యక్షత వహించారు. చార్టెడ్ అకౌంట్ నాగదేసి శామ్యూల్ హాజరై విద్యార్థులు ఉద్దేశించి భవిష్యత్తు యాజమాన్యం– మేనేజర్ల బాధ్యతల గురించి మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచీకరణలో మార్కెట్ నిర్వహణ రోజురోజుకీ మార్పులకు లోనవుతున్న విధానం, టెక్నాలజీ, ఆర్థికపరమైన అంశాలు, మార్కెట్ వ్యాపార నిర్వహణ పద్ధతులను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయన్నారు. టెలిఫోన్ నుంచి ఇంటర్నెట్, హ్యూమన్ ఇంటిలిజెంట్స్ నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరివర్తన చెందుతూ ఉన్న పరిస్థితులలో విధి నిర్వహణలో మేనేజర్లు తీసుకునేటువంటి నిర్ణయాలు వల్ల మాత్రమే సంస్థ పనితీరు, సక్సెస్ ఆధారపడి ఉంటాయని చెప్పారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని అదే సమయంలో టెక్నాలజీపై ఆధారపడి నిర్వహణ చేయకూడదన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బి.సుబ్బయ్య, డాక్టర్ ప్రభాకర్, బుజ్జిబాబు, సురేష్ పరిశోధకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తను విభాగం తరుపున సత్కరించారు.

కష్టతరమైన నిర్మాణాలు భారత్‌కే సాధ్యం



డాక్టర్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: కష్టతరమైన నిర్మాణాలను భారత్ సాకారం చేస్తోందని ఐఐటీ కాన్పూర్ విజిటింగ్ ప్రొఫెసర్ డాక్టర్ మంత్రాల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో విద్యార్థులనుద్దేశించి చీనాబ్ బ్రిడ్జి నిర్మాణంపై ప్రసంగించారు. ప్రపంచంలో అత్యంత ఎత్తయిన రైల్వే వంతెనగా చీనాబ్ బ్రిడ్జి నిలుస్తుందన్నారు. దీని నిర్మాణంలో తాను భాగస్వామ్యమయ్యానన్నారు. దీని ప్రత్యేకతలను వివరించారు. అదే విధంగా జమ్ము కశ్మీర్‌లోని బక్కల్, కౌరీ ప్రాంతాల మధ్య నిర్మించిన బ్రిడ్జి ప్రత్యేకతలను విద్యార్థులకు వివరించారు. ఈ వంతెన పేలుడు, భారీ గాలులు, భూకంపాలను సైతం తట్టుకునే విధంగా నిర్మించారన్నారు. కార్యక్రమంలో ఇండియన్ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూట్ వైజాగ్ చాప్టర్, ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ విశాఖ చాప్టర్‌సభ్యులు, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్ ఏయూ వీసీ ప్రసాద రెడ్డితో మర్యాదపూర్వకంగా కార్యాలయంలో భేటీ అయ్యారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి, విద్యార్థులకు ఉపయుక్తంగా చేపడుతున్న నూతన సంస్కరణలను డాక్టర్ శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య సీఎస్‌వీ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

వెలమల సంక్షేమానికి సహకారం



వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న రొంగలిజగన్నాథం, ఎమ్మెల్యే అదీప్‌రాజ్ , నాయకులు

మురళీనగర్: వెలమల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. వెలమ సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు రొంగలి జగన్నాథం, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో మురళీనగర్–మాధవధార వెలమ సంక్షేమ సంఘం నాయకులు శనివారం సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సంఘ కార్యాలయ భవనం నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. వైవీ సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు సంఘ ప్రతినిధులు చెప్పారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పాశల సూర్యనారాయణ, వెన్నెల సూర్యనారాయణ, సలహాదారు డాక్టర్ బోకం దేముడు, కోశాధికారి పాలుపురెడ్డి సన్యాసిరావు, ఉపాధ్యక్షుడు లాలం జానకీరామ్, డి.దేముడు, సభ్యులు గోవింద, ఎస్.దేముడు, వై.దేముడు, పి.దేముడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు.. అన్నసమారాధనలు



చీమలాపల్లిలో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ దేముడు



సుబ్రహ్మణ్య సమేతుడిగా గణపతి

సింహాచలం:వినాయక నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పూజలు.. అన్నసమారాధనలు నిర్వహించడంతో అంతటా ఆధ్యాత్మిక శోభ కనిపిస్తోంది. జీవీఎంసీ 95వవార్డు చీమలాపల్లిలోని శ్రీ కోదండ సీతారామాలయం ప్రాంగణంలో శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ ముమ్మనదేముడు కార్యక్రమాన్ని ప్రారంభించి అన్నప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎ.ఎర్రయ్య, దువ్వ అప్పారావు, ఎ.అప్పలరాజు, బొట్టా గోవింద్, నూకరాజు,అప్పలరాజు పాల్గొన్నారు.

◆ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెందుర్తిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో వేంచేసియున్న బెల్లం గణపతికి శనివారం పంచామృతాలు, పండ్లరసాలతో అభిషేకాలు చేశారు. సాయంత్రం 6 గంటలకు గణపతి సుబ్రహ్మణ్య సమేతుడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు.

◆ జీవీఎంసీ 93వవార్డు గణేష్‌కాలనీలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నసంతర్పణ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదాలు స్వీకరించారు. కాలనీ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, సెక్రటరీ పి.సూరిబాబు, ఉపాధ్యక్షుడు ఆర్.రామారావు పాల్గొన్నారు.

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు జాలరిపేటలో శ్రీ ముత్యమాంబ యూత్ ఏర్పాటు చేసిన వినాయకుడిని సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు ఎం.అప్పన్న, ఓలిశెట్టి పోలమ్మ, తాతారావు, కె.మసేను, గురూజీ పాల్గొన్నారు.

సబ్బవరం: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బీసీ కాలనీలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబు ఆధ్వర్యంలో శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదాలు స్వీకరించారు. అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

◆ దుర్గానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేషుని మండపం వద్ద వైఎస్సార్‌సీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు బంతికోళ్ల పద్మ ఆధ్వర్యంలో దీపారాధన నిర్వహించారు.అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని దీపాలు వెలిగించారు.



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న సర్పంచ్ సుజాతముత్యాలు

ఇక సింహగిరిపై గోవులకు వైద్యసేవలు



ట్రేవిస్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఈవో

సింహాచలం: సింహగిరిపై శ్రీగోకులం వద్ద గోవులకు వైద్యసేవలు అందించేందుకు వీలుగా నగరానికి చెందిన ఆర్. భాస్కర్‌రెడ్డి ట్రేవిస్ పరికరం అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి శనివారం ఆపరికరాన్ని ప్రారంభించారు. సింహగిరిపై శ్రీగోకులంలోని గోవులకు ఎలాంటి అనారోగ్య సమస్య తలెత్తినా దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలోని శ్రీకృష్ణాపురం గోశాలకు తరలించి అక్కడ వైద్యం అందించేవారు. దాత అందించిన పరికరం ద్వారా ఇక నుంచి సింహగిరిపైనే గోవులకు వైద్య సేవలు అందించనున్నారు. దేవస్థానానికి చెందిన వెటర్నరీ వైద్యుడు డాక్టర్ గణేష్ నాయుడు పలు గోవులను పరీక్షించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, ప్రత్యేక ఆహ్వానితుడు చందు యాదవ్, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈ హరి, పీఆర్‌వో నాయుడు పాల్గొన్నారు.

ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ కొనసాగించాలని వినతి

అగనంపూడి: విశాఖ – విజయవాడ మధ్య నడుస్తున్న ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (డబుల్ డెక్కర్)కు దువ్వాడలో హాల్ట్ కొనసాగించేందుకు చొరవ తీసుకోవాలని విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణను దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.జాషువా, కె.ఈశ్వర్ కోరారు. ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌కు దువ్వాడ నుంచి ఆదాయం తగ్గిందనే కారణంగా హాల్ట్‌ను ఉపసంహరించుకుంటున్నట్టు అధికారులు ప్రకటించడంతో ఈ ప్రాంతీయులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.